

రైతులపై కాల్పులు అమానుషం

కొడంగల్, ఫిబ్రవరి 25: ఢిల్లీలో హర్యానా, పంజాబ్ రైతులపై పోలీసులు కాల్పులు జరపడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వికారాబాద్ జిల్లా కార్యదర్శి సురేశ్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న వికారాబాద్ కలెక్టరేట్ వద్ద ఉదయం10 గంటలకు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బాబ్యానాయక్, గణేశ్, గోపాల్ పాల్గొన్నారు.

విరబూసిన మోదుగ పూలు

మోదుగు పూత హోలీ పండుగను గుర్తు చేస్తుంది. మండలంలో మోదుగ పూత విరగబూసింది. అడవులు, రహదారులకు ఇరువైపులా మోదుగు చెట్లకు పూసిన పువ్వులు కనువిందు చేస్తున్నాయి. కులకచర్ల, బండవెల్కిచర్ల, చౌడాపూర్, ముజాహిద్ పూర్, తిరుమలపూర్ గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా మోదుగుపూత ఆహూతులను ఆకట్టుకుంటుంది.

- కులకచర్ల, ఫిబ్రవరి 25



పట్టర పట్టు హైలెస్సా..

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 25: మండలంలోని వెల్చాల్ గ్రామంలో శ్రీ బొంబాయి కల్యాణ్ హాజీ మలాంగ్ షా బాబా ఉర్సు ఘనంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గంధోత్సవం, ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. చిత్తారి శ్రీనివాస్, ఆంజయ్య, శివ, నగేశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి, నారాయణ్‌ఖేడ్ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి దాదాపు 100 మంది మల్ల యోధులు పాల్గొన్నారు. ఇందులో రంగారెడ్డి జిల్లాకు చెందిన జారఅకాడమీ టీమ్ మొదటి బహుమతిని దక్కించుకోగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎం.మధుసూదన్‌రెడ్డి రూ.11వేలు నగదు బహుమతిని అందజేయగా, ద్వితీయ బహుమతి రూ.5వేలు విజయేందర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో వెల్చాల్ గ్రామస్థులు, ఎంపీటీసీ కుశాల్‌కుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మి, ఇబ్రహీం, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్య, విజయేందర్‌రెడ్డి, రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు



బియ్యం ధరలకు కళ్లెం పడేనా?

కొన్ని నెలలుగా బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి.. బహిరంగ మార్కెట్లో మండిపోతున్న బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత్ రైస్ ఇంకా జిల్లా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. భారత్ రైస్ పేరుతో అందుబాటులో తీసుకు వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి రెండు వారాలు గడిచిపోయినా ఇంకా ఆ బియ్యం ఎక్కడా కనిపించడం లేదు.

భారత్ రైస్ అందుబాటులోకి ఎప్పుడో?!

- పెరుగుతున్న బియ్యం ధరల నియంత్రణకు భారత్ రైస్ పేరిట కేంద్రం విక్రయాలు
- కిలో రూ.29లకే మార్కెట్లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటన
- రెండు వారాలైనా జిల్లాలో కనిపించని భారత్ రైస్
- ప్రజల ఎదురుచూపులు

వికారాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బహిరంగ మార్కెట్లో మండిపోతున్న బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత్ రైస్ ఇంకా జిల్లా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. భారత్ రైస్ మార్కెట్లోకి అందుబాటులో తీసుకు వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి రెండు వారాలు గడిచిపోయినా ఇంకా ఆ బియ్యం ఎక్కడా కనిపించడం లేదు. గత నాలుగు నెలలుగా బియ్యం ధరలు ఊహించని విధంగా పెరిగాయి. మార్కెట్లో సన్న బియ్యం క్వింటాల్ రూ. 5000 వేల నుంచి రూ.6500 వరకు విక్రయిస్తున్నారు. నాణ్యత ఆధారంగా కిలో రూ.50 నుంచి రూ.75 వరకు విక్రయిస్తున్నారు. పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించాలనే ఉద్దేశంతో కిలో రూ.29లకే బహిరంగ మార్కెట్లో విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.29లకు కిలో వంతున 10కిలోల బియ్యం బస్తాలను విక్రయించేందుకు ఈనెల 7వ తేదీ నుంచి బహిరంగ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం రూ.29లకు కిలో బియ్యం విక్రయాలపై ప్రకటన చేసిన రెండు వారాలు గడిచిపోయినా ఇంత వరకు జిల్లాలో ఎక్కడా భారత్ రైస్ ప్రజలకు అందుబాలోకి రాకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత్ రైస్ కొనుగోలు చేసేందుకు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి అడిగితే.. తాము విక్రయించడం లేదని డీలర్లు చెప్పడంతో వారు కంగుతింటున్నారు. భారత్ రైస్ ఎక్కడ లభిస్తుందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆ సంస్థలకే విక్రయ బాధ్యతలు

కేంద్రం ప్రకటించిన భారత్ రైస్‌ను విక్రయించే బాధ్యతను నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్, కేంద్రీయ భండార్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలో ఈ సంస్థలకు అనుబంధంగా కేంద్రాలు లేకపోవడంతో కేంద్రం ప్రకటించిన రూ.29లకే కిలో బియ్యం ప్రజలు అందుబాటులోకి రావడం లేదని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం భారత్ రైస్‌ను విక్రయించే బాధ్యతలు అప్పగించిన సంస్థలకు జిల్లాలో కేంద్రాలు లేవు. ఫలితంగా కేంద్రం రాయితీపై సరఫరా చేస్తున్న బియ్యం ప్రజలకు అందుబాటులోకి రావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం ధరలను నియంత్రించేందుకు కేంద్రప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిన భారత్ రైస్ విక్రయాలు మారుమూల గ్రామీణ ప్రజలకు కూడా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

రేషన్ దుకాణాల్లో విక్రయించాలి

మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా భారత్ రైస్ అందుబాటులో ఉండే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ-కామర్స్ సంస్థల ద్వారా భారత్ రైస్ విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కుగ్రామం నుంచి నగరాల వరకు ప్రజలకు అందుబాటులో ఉండే రేషన్ దుకాణాల ద్వారా భారత్ రైస్ విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో 588 రేషన్ దుకాణాలు ఉండగా, ఈ దుకాణాల్లో భారత్ రైస్ విక్రయించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. రేషన్ దుకాణాల్లో తెల్ల రేషన్, ఆహార భద్రత కార్డులు కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. రేషన్ దుకాణాల్లో ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్న మాదిరిగానే... భారత్ రైస్ కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత్ రైస్ విక్రయాలకు సంబంధించి మాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ నుంచి మార్గదర్శకాలు జారీ అయితేనే భారత్ రైస్ విక్రయాలపై స్పష్టత వస్తుంది.

- రాజేశ్వర్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి, వికారాబాద్

కమల దళంలో నయా జోష్!

- విజయవంతమైన విజయ సంకల్పయాత్ర
- జిల్లాలో రెండు రోజుల పాటు కొనసాగిన కార్యక్రమం



తాండూరులో విజయ సంకల్ప యాత్ర (ఫైల్)

తాండూరు/ వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప యాత్ర జిల్లాలో కమల దళంలో నయా జోష్ నింపింది. జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల పరిధిలో రెండు రోజుల పాటు కొనసాగిన విజయ సంకల్ప యాత్ర వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయావకాశాలను మెరుగయ్యేలా చేసిందని కమల దళం ధీమాతో ఉంది. రాజరాజేశ్వరి క్లస్టర్ పరిధిలో వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలను తీసుకువచ్చారు. ఈనెల 20న తాండూరు నుంచి రాజరాజేశ్వరి క్లస్టర్ విజయ సంకల్ప యాత్రకు కేంద్ర మంత్రి బీఎల్‌వర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, కామారెడ్డి ఎమ్మెల్యే, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాణీరుద్రమ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు హాజరయ్యారు. మొదటి రోజు మంబాపూర్, ధారూరు మీదుగా వికారాబాద్ వరకు యాత్ర కొనసాగగా, మరుసటి రోజు, బుధవారం ఎన్నేపల్లి, మద్గుల్ చిట్టంపల్లి, నస్కల్, పరిగి, రంగాపూర్, రాకంచర్ల, పూడూరు, మన్నేగూడ, అంగడి చిట్టంపల్లి వరకు జిల్లాలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర కొనసాగింది. ఈ యాత్రలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాణీరుద్రమ తదితరులు పాల్గొని విజయ సంకల్ప యాత్ర సభల్లో ప్రసంగించారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే పార్టీ విజయ సంకల్ప యాత్ర చేపట్టడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా ప్రజల్లోకి తమ సంకల్పాన్ని తీసుకు వెళ్లగలిగామన్న ధీమా కమల దళంలో వ్యక్తమవుతోంది. తాండూరులో ప్రారంభమైన రాజరాజేశ్వరి క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగి మార్చి ఒకటో తేదీన కరీంనగర్‌లో ముగియనుంది.

పేరుకే క్రీడా ప్రాంగణం!

- పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారిన వైనం
- నిర్వహణ గాలికి.. పంచాయతీలకే పరిమితమైన ఆట వస్తువులు



కంసాన్‌పల్లి(ఎం)లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

బషీరాబాద్, ఫిబ్రవరి 25: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రాంగణాలతో పాటు క్రీడా పరికరాలు నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వం పల్లెల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు ఆటలు ఆడుకునేందుకు ఆయా పంచాయతీలకు కిట్లను పంపిణీ చేసింది. బషీరాబాద్ మండలంలో 36 గ్రామ పంచాయతీలకుగాను క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం కిట్లను ఇచ్చినా లక్ష్యం నేరవేరడం లేదు. పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను అధికారులు, సిబ్బంది అనువుగాని ప్రదేశాల్లో ఏర్పాటు చేయడంతో అక్కరకు రాకుండా పోతున్నాయి. పలు గ్రామాల్లో పిచ్చిమొక్కలు, చెట్లు, రాళ్లురప్పలు ఉన్న చోట ఏర్పాటు చేయడం గమనార్హం. మరికొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ఉండటంతో కూడా యువత అటువైపు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కాశీంపూర్ శివారులో క్రీడాప్రాంగణం పేరుకు మాత్రమే ఉందని, అంతా రాళ్లు పరుచుకోని ఉండటంతో ఎవరికి ఉపయోగమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీలకు వాలీబాల్ కిట్, క్రికెట్ కిట్, వ్యాయామాలు చేసేందుకు డంబెల్స్, ఇతర పరికరాలను అందించినా ఎక్కడా కూడా వీటిని ఉపయోగిస్తున్న దాఖలాలు లేవు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఈసారైన పోటీ పెరిగేనా!

- మళ్లీ స్వగృహ వేలానికి కసరత్తు!
- ధర నిర్ణయం, తేదీ ఖరారుకు ప్రణాళిక



తాండూరు, ఫిబ్రవరి 25: తాండూరులోని రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లు, గృహాలకు త్వరలోనే బహిరంగ వేలం వేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ ధరలు, తేదీలను నిర్ణయించిన తర్వాత విస్తృత ప్రచారం కల్పించి వేలం వేసేందుకు చర్యలు చేపట్టారు. కమిటీ చైర్మన్ కలెక్టర్, ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్, డీటీసీపీ లేదా సమీప పట్టణానికి సంబంధించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు సభ్యులుగా, టీఆర్‌ఎస్‌సీఎల్ జనరల్ మేనేజర్‌ను కన్వీనర్‌గా నియమించారు. హైదరాబాద్ రోడ్డు మార్గం యాలాల మండలం కోకట్ గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే సర్వే నెం.52లో 221 ఎకరాలను రాజీవ్ స్వగృహకు కేటాయించిన విషయం తెలిసిందే. ఈస్థలానికి 'మనోహటౌన్‌షిప్'గా నామకరణం చేసిన విషయం విదితమే.

రేటు తగ్గించాలని డిమాండ్

గడిచిన రెండేళ్లుగా రేటు తగ్గించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. తాండూరు పట్టణ శివారులో ఉందని ఇక్కడ ప్రైవేట్‌గా ప్లాట్లకు సైతం అంత ధర లేదని, రూ.6 నుంచి 7వేల వరకూ ధర నిర్ణయించాలని ప్రజలు పలుమార్లు నిర్వహించిన సమావేశాలలో కోరిన విషయం విదితమే. ప్లాట్లకు ధర ఎక్కువగా ఉన్నందున కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదని పలువురు వాపోయారు. వాయిదాలు కూడా పెంచాలని, ఉద్యోగులైతే ఈఎంఐ అవకాశం కల్పించాలని కోరారు.

ప్లాట్ల వివరాలు

మొత్తం ప్లాట్లు	292
లే అవుట్ పూర్తయినవి	173
నిర్మాణం పూర్తయిన ఇళ్లు	16
అసంపూర్తిగా ఉన్నవి	100
ఓపెన్ ప్లాట్లు	176
ధర(స్క్వేర్ యార్డుకు)	10వేలు
మిగిలిన ప్లాట్లు	65

మహర్దశ!



- అమృత్ భారత్ కింద వికారాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల ఎంపిక
- వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.24.35 కోట్లు, రూ.15 కోట్లతో మేడ్చల్ రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ
- ఎయిర్‌పోర్టును తలపించే విధంగా అభివృద్ధి
- అమృత్ భారత్ స్టేషన్లకు నేడు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన

మేడ్చల్ /వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులకు నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో రూ.76.31 కోట్లతో వికారాబాద్, ఉందానగర్, షాద్‌నగర్ మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు ఎంపిక చేశారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.24.35 కోట్లు, ఉందానగర్ రూ.12.37 కోట్లు, షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌ను రూ.9.59 కోట్లు, మేడ్చల్ రూ.15 కోట్లు, మల్కాజ్‌గిరి రైల్వేస్టేషన్‌ను రూ.15 కోట్లతో ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం న్యూఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా అమృత్ భారత్ స్టేషన్ల కింద ఆయా రైల్వేస్టేషన్లలో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు భూమిపూజ, శంకుస్థాపనలు చేయనున్నారు.

మేడ్చల్ ప్రజలకు మరో కానుక

కాగా, మేడ్చల్ ప్రజలకు రైల్వేశాఖ మరో కానుక ఇచ్చింది. అమృత్ భారత్ కింద జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి రైల్వేస్టేషన్ ఎంపిక య్యాయి. ఈ పథకం కింద ఆయా రైల్వే స్టేషన్లను ఆధునికీకరించనున్నారు. ఏయిర్‌పోర్టును తలపించే విధంగా అన్ని హంగులతో మేడ్చల్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి పరచనున్నారు. ఇప్పటికే మేడ్చల్ ప్రాంతం ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించటానికి మేడ్చల్-సికింద్రాబాద్ రైల్వేలైన్‌ను విద్యుద్దీకరణ చేసి ఎంఎంటీఎస్ రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం స్థానిక స్టేషన్‌ను అన్ని హంగులతో మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు అమృత్‌స్టేషన్ కింద ఎంపిక చేశారు. హైదరాబాద్ డివిజన్‌లో మొత్తం 17రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ కింద ఎంపిక చేసినట్టు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. వీటిలో మల్కాజిగిరి, మేడ్చల్, షాద్‌నగర్, కామారెడ్డి తదితర స్టేషన్లు ఉన్నాయి. అయితే మేడ్చల్ జిల్లాకు చెందిన రెండు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి దాదాపు రూ. 30కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఇప్పటికే స్టేషన్‌లో చేపట్టాల్సిన పనులపై రైల్వే శాఖ ఉన్నత అధికారులు సమీక్షిస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్టేషన్‌లో చేపడుతున్న పనుల గురించి పరిశీలిస్తున్నారు.

అమృత్ భారత్ కింద చేపట్టే పనులు ఇవే...

అమృత్ భారత్ కింద రైల్వేస్టేషన్‌ను అధునాతనంగా అభివృద్ధి పర్చడంలో భాగంగా అనేక మార్పులు, చేర్పులు చేయనున్నారు. ప్రస్తుతం స్టేషన్‌కు రెండు వైపుల ఉన్న ప్లాట్‌ఫామ్‌లను పూర్తిగా ఆధునికీకరించనున్నారు. రెండు ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల సౌకర్యార్థం విద్యుత్‌తో నడిచే ఎస్కలేటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. రెండువైపుల ప్రత్యేక టికెట్ కౌంటర్లను, వాహనాల పార్కింగ్, క్యాంటీన్, ప్రయాణికులకు విశ్రాంతి గదులు, మహిళలకు , పురుషులకు ప్రత్యేకంగా టాయిలెట్లు ఏర్పాటు చేయనున్నారు. రిజర్వేషన్ కౌంటర్లు, ప్రయాణికులకు కుర్చీలు, వినోదానికి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు నేరుగా స్టేషన్‌కు చేరుకునే విధంగా పనులు చేపడుతున్నారు. విమానాశ్రయాన్ని తలపించే విధంగా స్టేషన్ ఆదునీకరణ ఉంటుందని అధికారులు తెలిపారు. మోడల్ రైల్వే స్టేషన్‌లో సకల సౌకర్యాలతో పాటు ప్రత్యేకంగా ఇక్కడి నుంచి కొన్ని రైళ్లను ప్రారంభించేందుకు వీలుంది. దీనికి తోడు కొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆగే వీలు కల్పిస్తున్నారు. వీటితో పాటు రైల్వే స్టేషన్ పరిసరాల సుందరీకరణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు.

గుండ్లపోచంపల్లి , గౌడవెల్లి ఆర్‌యూబీ పనులకు శంకుస్థాపన

గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి రైల్వేగేట్ల వద్ద నిర్మించే ఆర్‌యూబీ పనులకు నేడు ప్రధాన మంత్రి మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన మంత్రి మోదీ కార్యక్రమాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు.



ప్రభుత్వ పథకాలకు ఆర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

చేవెళ్ల, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై ఇతరప పార్టీల నేతలు తమ పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ నేత కుంచం శివకుమార్‌గుప్తా బీఆర్ఎస్ నుంచి తన అనుచరులతో కలిసి మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శివకుమార్‌కు కాంగ్రెస్ కండువా కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలనలో పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయనే నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరిన్నట్లు కుంచం శివకుమార్ గుప్తా చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పీఆర్ చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, దేవర సమతారెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, నాయకులు శ్రీనివాస్, రఘువీర్‌రెడ్డి ,మాణిక్యరెడ్డి, ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కుంచం శివకుమార్‌గుప్తా

శిథిలావస్థలో కొన్ని.. వృథాగా మరిన్ని

● కొందుర్గులోని ప్రభుత్వ భవనాల పరిస్థితి

కొందుర్గు, ఫిబ్రవరి 25 : మండలంలోని ప్రభుత్వ భవనాలు కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని వృథాగా ఉన్నాయి. బస్టాండ్ వెనక రేకుల గోదాంను గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వినియోగించుకోగా ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉంది. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ భవనాలు కూడా వృథాగా ఉన్నాయి. ఈ కార్యాలయ పాత భవనాన్ని 1959లో నిర్మించారు. దాంట్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించేవారు. కొందుర్గు నూతన మండలంగా ఏర్పడడంతో, మండల పరిషత్ కార్యాలయానికి ఈ భవనాన్ని కేటాయించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరో చోటుకు మార్చారు. కొంత కాలం తర్వాత పక్కనే ఉన్న మరో భవనంలోకి మార్చారు. ఇక్కడ సిబ్బందికి సరిపడా గదులు లేకపోవడంతో కొరత ఏర్పడింది. 2021లో రూ.కోటితో మండల పరిషత్ నూతన భవనాన్ని నిర్మించగా దాంట్లోకి మార్చారు. దీంతో శిథిలావస్థలో ఒకటి ఉండగా మరోటి వృథాగా మిగిలింది. ఈ కార్యాలయం ఆవరణలో సిబ్బంది కోసం గతంలో నిర్మించిన గదులు నిరుపయోగంగా మిగిలాయి. రెండు గదుల్లో ప్రభుత్వ పాల కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దాని పక్కనే ఉన్న మరో గది శిథిలావస్థకు చేరుకుంది. బాలుర బీసీ వసతి గృహం ముందున్న మరో గది నిరుపయోగంగానే ఉంది. షాద్‌నగర్-పరిగి రోడ్డు ప్రక్కన ఉన్న గోదాంలో గతంలో వ్యవసాయ కార్యాలయాన్ని నిర్వహించగా, కొన్నేళ్ల తరువాత మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఒక గదిలోకి మార్చారు. దీంతో గోదాం వృథాగా మారింది. రైతువేదికలు ఉపయోగంలోకి వచ్చాక వ్యవసాయాధికారులు అక్కడి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ గది కూడా ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీని పక్కనే గతంలో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ గదిని నిర్మించారు. అది కూడా ఉపయోగంలో లేదు. కొత్త మండల పరిషత్ కార్యాలయం ముందున్న పాత భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని కూల్చి, కొత్త మండల పరిషత్ కార్యాలయానికి రహదారిని నిర్మించాలని, వృథాగా ఉన్న సిబ్బంది గదులకు కొద్దిగా మరమ్మత్తులు చేసి, వినియోగంలోకి తేవాలని మండల వాసులు కోరుతున్నారు.



స్టోర్ రూంగా మారిన మండల పరిషత్ కార్యాలయ పాత భవనం



వృథాగా గృహనిర్మాణ శాఖ గృహం, వ్యవసాయాధికారి కార్యాలయం

ఉన్నతాధికారులకు తెలిపాం



మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న సిబ్బంది గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలాస్థకు చేరిన మండల పరిషత్ పాత భవనాన్ని కూల్చివేచేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. అనుమతి వచ్చిన వెంటనే దాన్ని నేలమట్టం చేయిస్తా.

ఆంజనేయులు, ఎంపీడీవో, కొందుర్గు.

నిస్వార్థంగా సమాజ సేవచేయాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 25 : మానవాళికి నిస్వార్థంగా సేవ చేయాలనే సందేశాన్ని బాబా హరదేవ్ సింగ్‌జీ మహారాజ్ అందించారని సంత్ నిరంకారి బ్రాంచ్ సభ్యులు అన్నారు. ఆయన చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని వారు స్పష్టం చేశారు. బాబా హరదేవ్‌సింగ్ మహారాజ్ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలో సంత్ నిరంకారి బ్రాంచ్, ముఖీ సంయోజక్ మాణిక్యప్రభు మహాత్మ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పుష్కరిణి ఆవరణలో స్వచ్ఛనీరు, స్వచ్ఛమనసు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కరిణి ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారు శైజలాఆగిరెడ్డి, సేవా సమితి సభ్యులు తదితరులు ఉన్నారు.



స్వచ్ఛనీరు, స్వచ్ఛమనసు కార్యక్రమంలో సంత్ నిరంకారి బ్రాంచ్ సభ్యులు

సేవాలాల్ సేవలు మరువలేనివి



సేవాలాల్ జయంతి వారోత్సవాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

- ఆమనగల్లులో భారీ ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు , ఫిబ్రవరి 25 : సమాజానికి సేవాలాల్ అందించిన సేవలు మరువలేనివని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గిరిజనుల ఆరాధ్యులు సంత్ సేవాలాల్ జయంతి వారోత్సవాలు ఆమనగల్లు పట్టణంలో ఆదివారం సేవాలాల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ ఘాట్ నుంచి జాతీయ రహదారి మీదుగా గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. సేవాలాల్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన జయంతి వారోత్సవాలలో వారు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తూ గిరిజన జాతి ఉద్ధరణకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దశరథ్‌నాయక్, సీఐ విజయ్ కుమార్, ఎస్ఐ బల్‌రామ్‌నాయక్, గిరిజన సంఘాల నాయకులు కృష్ణనాయక్, రవీందర్ నాయక్, అమర్‌సింగ్, పంతూనాయక్, శ్రీను నాయక్, రమేశ్‌నాయక్, శంకర్‌నాయక్, సురేశ్ నాయక్, రాంజానాయక్, సుమన్‌నాయక్, జైపాల్‌నాయక్, మల్లేశ్‌నాయక్, గణేశ్‌నాయక్, లక్ష్మీ, లచ్చిరామ్, బుజ్జి, స్వప్న, విజయ్‌రాథోడ్, చందు, హరి, గోపి, రాజేశ్, ప్రకాశ్, రాజు, కుమార్, మండల పరిధిలో గిరిజనులు, గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

- వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు పబ్లిక్‌పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ఇతర పాఠశాలల నుంచి టీచర్లను సర్దుబాటు చేసి విద్యార్థులకు విద్యాబోధన సాగేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తిచేసి రివిజన్ పాఠాలు చెబుతూనే, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అర్థంకాని పాఠ్యాంశాలలో సందేహాలను నివృత్తి చేస్తూ ఉత్తీర్ణతశాతం పెంచడం కోసం ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో నవంబరు 1 నుంచి ఈ ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. చౌదరిగూడలోని పెద్ద ఎల్కిచర్ల, ఎదిర, ఇంద్రానగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, లాల్‌పహాడ్ కేజీబీవీ పాఠశాలలో మొత్తం 245 మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక కార్యాచరణ

పదోతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉత్తమ ఫలితాలను సాధించడం కోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రభుత్వం సూచించిన టైంటేబుల్ ప్రకారం ఉదయం ఒక ఉపాధ్యాయుడు, సాయంత్రం మరొకరు తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను ఎ, బీ, సీ గ్రూపులుగా విభజించి సులువుగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో అవగాహన కల్పించేందుకు రోజువారి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారు చేసే తప్పులను వివరించి, పునరావృతం కాకుండా చూస్తున్నారు. తెల్లవారుజామునే ఫోన్‌చేసి నిద్రలేపి చదివేలా ప్రోత్సహిస్తూ, వాట్సప్ గ్రూపుల ద్వారా సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వారి ప్రతిభను తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు.

వెనుక బడిన విద్యార్థులకు వరం

తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధనకే పరిమితమవుతారు. దాంతో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధకు అవకాశం ఉండదు. దీంతో చురుకైన విద్యార్థులు మాత్రమే ముందజ వేస్తారు. వెనుకబడిన విద్యార్థులు ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారికి ఈ ప్రత్యేక తరగతులు వరంగా మారాయి. వారికి ఉన్న సందేహాలను ఈ క్లాసుల్లో ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ప్రధానంగా గణితం, భౌతిక, జీవశాస్త్రం, ఇంగ్లీష్‌లో విద్యార్థులకు వస్తున్న సందేహాలను ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకొంటున్నారని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

గణితంలో వందశాతం మార్కులు సాధిస్తా



గణితంలో వందశాతం మార్కులు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఈ ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయుల వద్ద సందేహాలు నివృత్తి చేసుకుంటున్నా. రేఖీయ సమీకరణాలు, త్రికోణమితి, సిద్ధాంతాలు, శ్రేణులు, బహుపదులపై ఎక్కువ సందేహాలు తీర్చుకుంటున్నా.

స్వాతి, విద్యార్థిని, జడ్పీహెచ్ఎస్, చౌదరిగూడ

తికమక పెడుతున్న భౌతిక శాస్త్రం



భౌతికశాస్త్రంలోని కొన్ని అంశాలు తికమక పెడుతున్నాయి. ఈ ప్రత్యేక తరగతులు అన్ని సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. కష్టపడి మంచి మార్కులు సాధిస్తా.

నందీశ్వరి, విద్యార్థిని, జడ్పీహెచ్ఎస్, పెద్దఎల్కిచర్ల

గణితంలో మెలకువలు నేర్పుతున్నా



గణితంలోని వివిధ అధ్యాయాల్లోని కఠినమైన లెక్కలను కూడా విద్యార్థులు సులభంగా చేసేలా ప్రత్యేక తరగతుల్లో మెలకువలు నేర్పుతున్నా. వారిని బృందాలుగా ఏర్పాటు చేసి, మంచి మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉన్న అంశాలపై ఈ ప్రత్యేక తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నా.

నాగేశ్వర్‌రావు, గణిత ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, చౌదరిగూడ

సులభ పద్ధతిలో బోధన



భౌతికశాస్త్రం అనగానే విద్యార్థుల్లో ఎక్కువ భయం ఉంటుంది. వారిలో ఆందోళనను తొలగించి, ఎక్కువ మార్కులు తెచ్చుకునేలా సులభ పద్ధతుల్లో మెలకువలు నేర్పిస్తున్నా. కటకాల్లో వక్రీకరణ, లక్షణాలపై విద్యార్థులు ఎక్కువ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వాటిని చక్కగా వివరించి వారిలో ధైర్యం నింపుతున్నా.

ఎస్ రత్నం, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, పెద్దఎల్కిచర్ల

317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం హర్షణీయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు

షాద్‌నగర్, ఫిబ్రవరి 24: బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదరబాదరగా, అశాస్త్రీయంగా తీసుకొచ్చిన 317 జీవోపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించడం హర్షణీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని చెప్పారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 317 జీవో వల్ల ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎన్నో బాధలు పడుతున్నా గత ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ జీవో గురించి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి మంత్రులు దామోదర రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ వేశారని చెప్పారు. 317 జీవోతో ఉద్యోగులు పడుతున్న సమస్యలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సీఎంకు నివేదిక అందజేస్తుందని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేలోపే కమిటీ నివేదిక అందజేసే అవకాశం ఉందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అశాస్త్రీయంగా కొత్త జిల్లాల ఏర్పాటు

కొత్త జిల్లాల ఏర్పాటులోనూ బీఆర్ఎస్ ప్రభుత్వ డొల్లతనం బయట పడుతోందని, అశాస్త్రీయంగా జిల్లాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఎలాంటి వసతులు లేని మారుమూల గ్రామాలను పంచాయతీలుగా మార్చిందని విమర్శించారు. దీన్ని సరిదిద్దుకోవడం కోసమే నాటి ప్రభుత్వం 317 జీవో తెచ్చి స్థానికత అంశాన్ని తెరపైకి తెచ్చి ఉపాధ్యాయులను మానసికవేదనకు గురి చేసిందని చెప్పారు. గత రెండున్నర సంవత్సరాలుగా వారు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. సబ్ కమిటీ వీలైనంత త్వరగా అధ్యయాన్ని పూర్తి చేసి నివేదిక అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

పర్యావరణ పరిరక్షణకు నాయకత్వం వహించాలి

- ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి

కడ్తాల్ , ఫిబ్రవరి 25 : విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు నాయకత్వం వహించాలని, సమాజసేవలో భాగస్వామ్యం కావాలని ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ చైర్మన్ (సీజీఆర్) లీలాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించి ముందుకుసాగాలని చెప్పారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో సీజీఆర్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన లీడ్ ఎర్త్ లీడర్స్ శిక్షణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ముగిసింది. సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ఉపేందర్‌రెడ్డి, లీలారెడ్డి, డీఏస్వోలు బానుప్రకాశ్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి జిల్లాలకు చెందిన శిక్షణ పొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా వారు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ శాస్త్ర వేత్తలు డాక్టర్ నక్కసాయి భాస్కర్‌రెడ్డి పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి

ఈ సందర్భంగా లీలాలక్ష్మారెడ్డి, ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై మానవ మనుగడ ఆధారపడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర్‌రెడ్డి, మల్లేశం, భాల్‌రాజ్, నర్సింహులు, మాధవి, యమున, జయప్రద, వెంకటేశ్, రజనీకాంత్, వీరేశ్, లక్ష్మీప్రసన్న, సుష్మ, నాగేశ్, పాల్గొన్నారు.

చెరుకు రసం.. ఆరోగ్యకరం

- రోజుకో గ్లాసు తాగితే ఎంతో మేలు

పరిగి, ఫిబ్రవరి 25 : వేసవికాలం వచ్చిందంటే చాలు ఏ చౌరస్తాలో చూసినా చెరుకురసం అమ్మే బండ్లు కనిపిస్తాయి. మండుటెండ నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు చెరుకురసాన్ని తాగేందుకు అందరూ ఆసక్తి కనబరుస్తారు. ఇది దాహార్తిని తీర్చడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చక్కని మేలు చేస్తుంది. ఎంతగానో దోహదపడుతుంది.

మూత్ర సమస్యలను నివారిస్తుంది

చెరుకురసం ఆరోగ్యానికి ఏ విధంగా ఉపకరిస్తుందో చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇది శక్తిదాయకంగా ఉపకరిస్తుంది. జీర్ణవ్యవస్థ బాగా పనిచేసేలా చేస్తుంది. రక్తంలో చక్కరశాతం తగ్గినప్పుడు, కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించినప్పుడు చెరుకురసం తాగితే ఉపశమనం పొందవచ్చు. రోజూ ఒక గ్లాసు తాగితే ఎంతో మంచింది. చెరుకురసంలో కాస్త నిమ్మరసం కలిపి తాగితే చాలామంచిది. ఇందులో ఉత్తమ రకం ఐరన్ లభ్యమవుతుంది. అది త్వరగా కలిసిపోయి రక్తహీనతను దూరం చేస్తుంది. చెరుకురసంలో ప్రొటీన్లు, మంచి పోషకవిలువలు ఉంటాయి. ఇందులో ఎక్కువ ఇనాంసిటల్ ఉండడంతో శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచి చాలా బాగా పని చేస్తుంది. చెరుకురసాన్ని బాగా మరిగించి తాగితే మలబద్ధకం సమస్య ఉండదు. అల్లం కలుపుకుని రసం తాగినా, చెరుకు నమిలినా గొంతు గరగర నుంచి ఉపశమనం పొందవచ్చు. చెరుకురసం పచ్చకామెర్ల వ్యాధిగ్రస్తులకు లాభాదాయకంగా పని చేస్తుంది. ఇది ఆ వ్యాధిని సమూలంగా నాశనం చేస్తుంది. వాంతులు అవతున్నప్పటికి దీనిని తాగితే ప్రశాంతత లభిస్తుంది. ఈ రసంలో ఉసిరిరసం, దానిమ్మ, తేనె కలిపి తాగితే వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. అంతేకాకుండా రక్తంవృద్ధికి దోహదపడుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న చెరుకురసాన్ని రోజుకో గ్లాసు తాగితే మంచిది. మరి ఇక నుంచి తాగేద్దాం.!




మొబైల్ చెరుకురసం బండి



\- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చిట్యాల ఆరోగ్య కేంద్రం, పరిగి

ఊరూరా బెల్ట్ షాపులు



ఓ బెల్టుదుకాణంలో స్వాధీనం చేసుకున్న మద్యం ఫైల్

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- పేదల రెక్కల కష్టాన్ని కాజేస్తున్న అక్రమార్కులు

యాచారం, ఫిబ్రవరి 25 : గ్రామాల్లో బెల్టు షాపులను అరికట్టేందుకు అధికారుల చర్యలు లేక మద్యం దందా జోరుగా సాగుతోంది. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి 15 వరకు బెల్టుషాపులు నడుస్తున్నాయి. మద్యం అమ్మకాలను పెంచేందుకు అధికారులే బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి. మొండిగౌరెల్లిలో బెల్టుషాపు నిర్వాహకులు ఎమ్మార్పీకే మద్యం సీసాలు అని వాట్సాప్‌లో ప్రచారం చేయిస్తున్నారంటే వారి వెనుక ఉన్న బలమేంటో అర్థమవుతోందని గ్రామస్తులు అంటున్నారు. కాగా మహిళలే బెల్టుషాపులను నిర్వహిస్తున్నారని, నాయకుల అండదండలతోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలొస్తున్నాయి.

పదుల సంఖ్యలో బెల్టు దుకాణాలు..

గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండడంతో యువకులు మద్యానికి బానిసవుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నందివనపర్తిలో 15, మంతన్‌గౌరెల్లిలో 12, చిన్నతూండ్లలో 8, కుర్మిద్దలో 4, తమ్మలోనిగూడలో 6, యాచారంలో 2, మల్కీజ్‌గూడలో 5, మొండి గౌరెల్లిలో 4, చౌదర్‌పల్లిలో 6, గడ్డమల్లాయగూడలో 7 చొప్పున బెల్టు షాపులున్నాయి. మేడిపల్లి మద్యం దుకాణం నుంచి పల్లెచెల్కతండా, సరికొండ బెల్ట్‌షాప్‌కు మద్యం రవాణా చేస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో రాయల్ స్టాగ్ క్వార్టర్ రూ.240(ఎమ్మార్పీ 192)కి, చీప్ లిక్కర్ రూ.120(ఎమ్మార్పీ 90)కి, లైట్ బీర్ రూ.150(ఎమ్మార్పీ 120)కి అమ్ముతున్నారు. ప్రతీ సీసాపై 30 నుంచి 40 రూపాయల వరకు ఎక్కువ తీసుకుంటున్నారు. మద్యానికి అలవాటు పడి యువకులు డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్నారు. మద్యం మత్తులో బైక్‌లను అతి వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ వారి జోలికే వెళ్లడం లేదు. ఊళ్లోనే మద్యం దొరుకుతుండడంతో పేదలు కూలి డబ్బంతా మద్యానికే ఖర్చు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మొండిగౌరెల్లిలో ఎమ్మార్పీకే మద్యం విక్రయం అని వాట్సాప్‌లో ప్రచారం చేసిన బెల్టుషాపు నడుపుతున్న వ్యక్తిని బైండోవర్ చేశామని పోలీసులు చెప్పారు. బెల్టుషాపులు అడ్డుకట్టుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బెల్టు షాపులపై ఆరా తీస్తున్నాం



ఏ గ్రామంలో ఎన్ని బెల్టు దుకాణాలున్నాయో పంచాయతీ కార్యదర్శులతో ఆరా తీస్తున్నాం. పూర్తి సమాచారం రాగానే వివరాలను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. బెల్టు దుకాణాలు మూయించేందుకు కృషి చేస్తాం.

\- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో, యాచారం

నానక్‌రాంగూడలో భారీ అగ్నిప్రమాదం

- సకాలంలో అధికారులు
- స్పందించడంతో తప్పిన పెనుముప్పు

రాయదుర్గం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడ ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా రోడ్డు పక్కన ఆదివారం రాత్రి 8గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. సుమారుగా ఐదు మీటర్ల ఎత్తు వరకు మంటలు ఎగసిపడటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు, మాదాపూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే రోడ్డుపక్కన భూగర్భగ్యాస్‌పైపులైన్ పైన కొంతకాలంగా చుట్టుపక్కల ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులు చెత్తవేశారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆ చెత్తకు నిప్పంటించడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలను తెలుసుకుని అగ్నిప్రమాదానికి గల కారణాలపై విచారిస్తామని ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



ఎగసిపడుతున్న మంటలు

కుమారుడిని హతమార్చిన తండ్రి

- డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య లొల్లి
- కొడుకు కనిపించడం లేదంటూ నాటకం

శామీర్‌పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తి అడిగిన కుమారుడిని అతి దారుణంగా హత్య చేశాడు ఓ తండ్రి. ఆపై.. ఆధారాలు లేకుండా చేసేందుకు మృతదేహాన్ని బావిలో పడేశాడు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలో జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన కొరివి రాంచందర్, కొరివి మంజుల.. తమ పెద్ద కుమారుడు నరేశ్(27) కనిపించడంలేదంటూ తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఈనెల 11న ఆస్తి వాటా, డబ్బుల విషయంలో తండ్రి రాంచందర్, కుమారుడు నరేశ్ మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆస్తిని నరేశ్‌కు పంచివ్వడానికి రాంచందర్ అంగీకరించాడు. ఆ తర్వాత తనకు రూ.పది వేలు కావాలని నరేశ్ తండ్రిని అడిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అయితే డబ్బులిస్తానని తండ్రి రాంచందర్ కొడుకు నరేశ్‌ను నమ్మించి ఈనెల 11న లాల్‌గడి మలక్‌పేట పరిధిలోని మర్లల్ల బావి సమీపంలోకి తీసుకెళ్లి మద్యం తాగించాడు. మద్యం మత్తులో నరేశ్ నేలపై పడిపోవడంతో రాంచందర్ నరేశ్ మెడపై కాలుతో బలంగా తొక్కాడు. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం మృతదేహాన్ని రాంచందర్ దగ్గరలో ఉన్న బావిలో పడేశాడు. పోలీసుల విచారణలో అసలు విషయం తెలిసింది. నరేశ్‌కు భార్య, ఏడాదిన్నర బాబు ఉన్నారు.



విలపిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్‌లో హత్యకు గురైన నరేశ్(ఫైల్)

ఘనంగా మహిళాశక్తి సమ్మేళనం

శంషాబాద్, ఫిబ్రవరి 25 : మహిళలు మహాశక్తివంతులని, మహిళా శక్తిని మరింతగా పెంపొందించడానికి రాష్ట్రీయ సేవికా సమితి అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని ప్రముఖ గాయని పద్మశ్రీ డాక్టర్ శోభారాజు అన్నారు. శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం రాష్ట్రీయ సేవికా సమితి భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో మహిళాశక్తి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భారతీయ మహిళలు అంటే వంటింటికే పరిమితం అనే భావన చాలా మందిలో ఉందన్నారు. మహిళలకు ఏమీతెలియదు, ఏమీరాదనే భావనను మహిళలపై రుద్దారన్నారు. మహిళలకు ఏమీ తెలియకపోతే పెళ్లిలో నూతన దంపతులకు వశిష్ఠుడి భార్య అరుంధతి (నక్షత్రాన్ని)ని ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. సమాజంలో ఉన్న ప్రచారంవలే మహిళలు ఏం తెలియని వారేమీ కాదన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎల్. ఉజ్వల, డాక్టర్ కళ్లెంస్వప్న. జీ. రమాదేవి, గోవర్ధనం ప్రసన్నలక్ష్మి తో పాటు వీహెచ్‌పీ నాయకుడు కొత్తశ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శోభారాజు

మేడ్చల్ మెట్రోను ఫేజ్-2లో చేర్చాలి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మేడ్చల్‌కు మెట్రోను ఫేజ్-2లో చేర్చాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సుచిత్ర జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతుగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భరత్ సింహారెడ్డి, మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ ఫేజ్-2లో మేడ్చల్‌ను చేర్చకుంటే ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, గచ్చిబౌలికి, ఉప్పల్, ఎల్‌బీనగర్‌కి, శంషాబాద్‌కు మెట్రో వస్తుంది కానీ, ఉత్తరాన ఉన్న మేడ్చల్ ప్రాంతానికి మెట్రో లేక పోవడం చాలా బాధాకరం అన్నారు. మేడ్చల్ ప్రాంతానికి మెట్రో ను ప్రభుత్వం ఇవ్వాలని మూడు నెలల నుంచి మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సంపత్ రెడ్డి, జార్జ్, ఉదయ్ గుప్త, రాజారెడ్డి, అరవిందరావు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు



మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాజశేఖర్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి పొల్కంపల్లి సొసైటీ చైర్మన్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25 : ఇబ్రహీంపట్నం పరిధి పొల్కంపల్లి సహకార సంఘం చైర్మన్ చిన్నగంట రాజశేఖర్ రెడ్డితోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని భావించి బీఆర్ఎస్‌ను వీడి ఆ పార్టీలో చేరినట్లు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ వేముల లక్ష్మణ్ రావు తదితరులున్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీ



వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వికారాబాద్, ఫిబ్రవరి 25: వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. స్టేషన్ పరిసరాలు, అనుమానాస్పద వస్తువులను పరిశీలించారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానస్పదమైన వ్యక్తులు కనిపిస్తే పోలీసు అధికారులకు గానీ, 100కు గానీ సమాచారం అందించాలని వారు సూచించారు.

ప్రత్యేక రైలులో అయోధ్యకు రామభక్తులు



తాండూరు నుంచి అయోధ్యకు బయల్దేరిన ప్రత్యేక రైలు

తాండూరు, ఫిబ్రవరి 25: తాండూరు నియోజకవర్గం నుంచి 300 మంది రామ భక్తులు ఆదివారం అయోధ్యకు ప్రత్యేక రైలులో బయలు దేరి వెళ్లారు. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షురాలు అంతారం లలిత, ఉపాధ్యక్షులు బాలి శివకుమార్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి వీడ్కోలు చెప్పారు.

ప్రత్యేక వాహనంలో టీటీఆర్ ఆసుపత్రికి గ్రామస్తులు



పటాన్ చెరువు వెళ్తున్న గ్రామస్తులు

కులకచర్ల, ఫిబ్రవరి 25: మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పటాన్ చెరువు టీటీఆర్ ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ముజాహిద్‌పూర్, రాంరెడ్డిపల్లి, అల్లాపూర్ తదితర గ్రామాల ప్రజలు వైద్య పరీక్షల కోసం టీటీఆర్ ఆసుపత్రికి వెళ్లారు. వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసి తీసుకొస్తారని కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మిఆనంద్ తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు

దోమ, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1994-95 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత జ్ఞాపకాలు ఉన్నాయని, జీవితంలో మర్చిపోలేమని కొనియాడారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా గురువులు, స్నేహితులను మర్చిపోలేమన్నారు. ఎవరు ఏ వృత్తిలో ఎదిగినా ఒకరికొకరు సహాయ సహకారాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెచ్ఎం మల్లయ్య, బుచ్చిరెడ్డి, పూర్వవిద్యార్థులు మొగులయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొర్రెములలో..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 25: కొర్రెముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2007-2008 బ్యాచ్‌విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో స్థానిక శోభా గెస్ట్ హౌస్‌లో ఆనందోత్సవాల మధ్య జరిగింది. వారికి విద్యాబుద్దులు నేర్పిన గురువులకు పాదాభివందనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రహ్లాద్, శివన్న, నర్సింహులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవాబుపేట, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ పార్టీ చేవేళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ సమక్షంలో పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. కేజీఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కేసారం రాజేందర్‌లు కాంగ్రెస్‌లో చేరగా వారిని కండువాలతో భీమ్‌భరత్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, బ్లాక్-బీ అధ్యక్షుడు పోలీసు మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ ఎండీ.ఇక్బాల్, సామ వెంకటరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ సంజీవరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు గుండాల శ్రీనివాస్‌రెడ్డి, సంగారెడ్డి, ఉపసర్పంచ్ మల్లేశ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎస్ఐ

ధారూరు, ఫిబ్రవరి 25: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కీర్తిశేషులు గడ్డం శైలజ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో నబీల్‌టీమ్, పలాన్ టీమ్‌లు తలపడగా నబీల్‌టీమ్ విజేతగా, పాలాన్ టీమ్ రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు రూ.25వేలు, 15వేల ప్రైజ్‌మనీ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబాఖాన్, ముజాఫర్, అవినాష్‌రెడ్డి, ఎంఐఎం అధ్యక్షుడు మోయిజ్ ఖురేషి, ఆర్గనైజర్లు జహీర్, మాసిన్, ఖురేషి, అబ్బాస్, బాబాకురేశి పాల్గొన్నారు.

అంబేడ్కర్ నేటి తరానికి స్ఫూర్తి

● జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25: అంబేడ్కర్ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి 150వ వారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ సారథ్యంలో రచించిన రాజ్యాంగం అందరికీ ఆదర్శమన్నారు. ఆనాడే అనేక దేశాల్లో పర్యటించి ఆయాదేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి రచించిందే భారత రాజ్యాంగం అని అన్నారు. ఆనాడు రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని గుర్తు చేశారు. మనమందరూ సమానమని చెప్పి అందరికీ ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. నేటి యువత సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. రాజకీయాల్లో విలువలు పెంపొందించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు మీసాల అరుణ్‌కుమార్, నాయకులు మహేష్, ముత్యాలు యాదవ్, కౌన్సిలర్ మల్లేష్, రాధాకృష్ణ, వెంకటేష్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, నర్సింగ్‌రావు, అశోక్ గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రమాణం చేస్తున్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

రాష్ట్రస్థాయిలో సంగం లక్ష్మీబాయి పాఠశాల విద్యార్థి ప్రతిభ



శ్రేయ

వికారాబాద్, ఫిబ్రవరి 25: జాతీయ సైన్స్ దినోత్సవంలో వికారాబాద్ జిల్లా నుంచి వివిధ పాఠశాలలు రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో సంగం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని బి.శ్రేయ చిత్రలేఖనం విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్‌సైన్స్ టెక్నాలజీ(డీఎస్‌టీ) గోల్ నేషనల్ సైన్స్‌డే (ఎన్ఎస్‌డీ)2024 ఎస్ఐ వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతలు అనే థీమ్‌ను ప్రకటించి నట్లు తెలిపారు. వీరిని జిల్లా విద్యాధికారిణి అభినందించారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ మిషన్ లైఫ్ (పర్యావరణానికి జీవన శైలి) స్పాన్సర్ చేసిన పోటీలను నిర్వహించాయన్నారు. పెయింటింగ్, పద్యాలు, గానం ప్రసంగం ఫిబ్రవరి 28న వరంగల్‌లోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఎన్ఎస్‌డీ 2024 వేడుకల కార్యక్రమాన్ని ముగించనున్నట్లు తెలిపారు. నాలుగు కేటగిరీల కింద వచ్చిన 396 నామినేషన్లలో 20మంది విజేతలను జ్యూరీ ఎంపిక చేసిందన్నారు. 2024, ఫిబ్రవరి 28న ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో బహుమతుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి

మేడ్చల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలోనే దేశంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజలకు మోదీ అండగా నిలబడ్డారన్నారు. మూడోసారి మోదీని ఆశీర్వదించాలని కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణాలో 17స్థానాల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణాను దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నాగారం, రాంపల్లి చౌరస్తా, బండ్లగూడ, చీర్యాల చౌరస్తాల మీదుగా ఔటర్ రింగు రోడ్డు వరకు విజయ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు అమరం మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుమల రెడ్డి, దేశం మల్లేశం, గాలి సంపత్ యాదవ్, నర్సింహ, నాగ మల్లారెడ్డి, కమల్, రవీందర్‌గౌడ్, పుణ్యరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు



విగ్రహ ప్రతిష్ఠాపనలో దాతలు రోహిత్ మహరాజ్, ఉమామహేశ్వరావు

శామీర్‌పేట, ఫిబ్రవరి 25: మండలంలోని పొన్నాల్ పరిధిలోని శ్రీగండి చిత్తారమ్మ, పెద్దమ్మ జాతర ఉత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆ ఆలయ నిర్మాణ దాత, ధర్మకర్త పట్కార్ గడ్డి రాజు, గ్రామ నాయకులు బత్తిని సత్యనారాయణ, వరప్రసాద్‌ల, గడ్డం రమేశ్ ఆధ్వర్యంలో శ్రీగండి చిత్తారమ్మ, పెద్దమ్మ వార్షికోత్సవం, జాతర ఉత్సవాలను పెద్ద ఎత్తున కనుల పండువలా నిర్వహించారు. కాగా వారు ఈ అమ్మవార్ల జాతర ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా అవసరమైన ఏర్పాట్లను చేశారు. ఈ జాతర ఉత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాల, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేసి శ్రీచిత్తారమ్మ, పెద్దమ్మ అమ్మవార్లను అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు వివిధ పార్టీల నాయకులు ఆలయానికి విచ్చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవార్లను దర్శించుకున్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన

బషీరాబాద్: నవాంద్గీ సంగమేశ్వరాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం కనుల పండువగా సాగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం స్థాపిత శ్రీసాక్షి గణపతి, పంచనాగుల విగ్రహాల యంత్ర స్థాపన, జలాభిషేకం, హోమం వంటి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. విగ్రహ దాతలు ఎం.రోహిత్‌మహరాజ్, బషీరాబాద్ సత్యసాయి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యజమాని ఉమామహేశ్వరావు నేతృత్వంలో ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అంతకు ముందు ఆలయ ప్రధానపూజారి మహంతయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. స్థానికులతో పాటు సమీప ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో వచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాండ్ల వీరన్న, పవన్‌ఠాగూర్, సాయిల్‌గౌడ్, సిద్ధార్థ, మాధవరెడ్డి, రవీందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పోలెపల్లి ఎల్లమ్మ జాతర



ముస్తాబవుతున్న పోలెపల్లి ఎల్లమ్మ ఆలయం

బొంరాస్‌పేట్: ఈనెల 29నుంచి దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మినీ మేడారంగా పిలువబడే పోలెపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో ఈనెల 29వ తేదీన పల్లకీసేవ, మార్చి 1న సిడె లాగుట, 2న రథారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. సిడె, రథాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏదుల జయరాములు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం పుణ్యాహవచనము, గీతాహవనము, దూవాసున, శ్రద్ధాత్రయ మోక్షసన్యాస యోగముల హవనము, మహాపూర్ణాహుతి, హారతి, మంత్ర పుష్పం, ఆశీర్వచనం, పండిత సన్మాన కార్యక్రమాలు జరిగాయి. చక్రతీర్థ స్నానం, ఆరగింపు, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పాలాచార్యులు, రాంప్రసాద్, వరదరాజులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



ఘట్‌కేసర్‌లో క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 25: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ఆదివారం రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణ నడిబొడ్డున గల ఖాళీస్థలంలో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు ప్రధానంగా పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని గ్రౌండ్‌లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పల్లుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు నస్రీన్ సుల్తాన, ఆంజనేయులు, జహంగీర్, నాయకులు సిరాజ్, రహీం స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంకు శివస్వాముల పాదయాత్ర



మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 25: శివరాత్రిను పురస్కరించుకుని దీక్షను తీసుకున్న శివస్వాములు ఆదివారం మేడ్చల్ నుండి శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

చంద్రగిరి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనాథ్‌రెడ్డి



కీసర చంద్రగిరి కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కీసర, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని చంద్రగిరి వేల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షుడిగా బొబ్బిలి శ్రీనాథ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం కాలనీ అసోసియేషన్ భవనం వద్ద ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా వీఆర్‌సీ అబ్బినేని, ఉపాధ్యక్షుడిగా కె.గణేష్, ఎస్.లక్ష్మారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా రవీంద్రనాథ్, ఏ.మహేశ్వరి, కోశాధికారిగా విశాల్ యాదవ్‌లను ఎన్నుకున్నారు.

ముగిసిన దక్ష-2024 జాతీయ సదస్సు



కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 25: జాతీయ స్థాయి సదస్సులను విద్యార్థులు వినియోగించుకోవాలని సీఎస్‌సీ హెచ్‌వోడీ జి.విష్ణుమూర్తి తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో రెండురోజులుగా జరిగిన దక్ష-2024 జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. 175 కళాశాలల నుంచి 5వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్లు మహిపతి శ్రీనివాస్‌రావు, కన్వీనర్ రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, స్వప్నగౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గౌడసంఘం ప్రతినిధులు

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ గౌడసంఘం ఆధ్వర్యంలో స్థానికంగా కంఠమహేశ్వర స్వామి (కాటమయ్య) ఆలయాన్ని నిర్మించారు. మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈమేరకు నాగారం గౌడసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పలువురు మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, తదితరులను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాగారం గౌడసంఘం ప్రతినిధులు గూడూరు ఆంజనేయులుగౌడ్, మహేష్‌గౌడ్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవకు తిరుమల వెళ్లిన భక్తులు



తిరుపతిలో శ్రీవారి సేవకు వెళ్తున్న భక్తులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 25: బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన 11మంది దళితులు తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారికి, భక్తులకు సేవ చేసేందుకు బయల్దేరారు. ఆదివారం సాయంత్రం వారు తిరుపతి దేవస్థానానికి ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్, దాసరి రాములు ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, ఫిబ్రవరి 25: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామానికి సీసీరోడ్ల నిర్మాణాలకు ఉపాధి నిధులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీఆనంద్, ఉపసర్పంచ్ చంద్రభూపాల్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణయ్య, బాలకృష్ణయ్య, షర్ఫుద్దీన్, కిష్టయ్య, రాములు, సోమలింగం, ఫీల్డ్ అసిస్టెంట్ అనంతయ్య పాల్గొన్నారు.

వైభవంగా మహాపడిపూజ



దీపార్చన చేస్తున్న సిద్రాల శ్రీనివాస్ దంపతులు

యాలాల, ఫిబ్రవరి 25: మండలకేంద్రంలో శనివారం ద్వాదశి జ్యోతిర్లింగాల మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా కొనసాగింది. యాలాల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ద్వాదశి జ్యోతిర్లింగాల మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి శివస్వాములు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. శివనామ స్మరణతో యాలాల గ్రామం మారుమోగింది. ఈ శివ పూజ కార్యక్రమానికి ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, మాజీ వైస్‌ఎంపీపీ అనంతయ్య ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, బసిరెడ్డి, వెంకటయ్య, చరణ్ హాజరయ్యారు.

ప్రియాంకాగాంధీ సభను విజయవంతం చేయాలి



పరిగిలో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

పరిగి,ఫిబ్రవరి 25: చేవెళ్లలో ఈనెల 27న నిర్వహించే కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల సభకు పరిగి నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతిపార్థసారధి, పార్టీ పరిగి మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ కోరారు. చేవెళ్ల సభకు సంబంధించి ఆదివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఎన్నికలముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేయనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అన్ని హామీలు అమలు చేయనున్నట్లు తెలిపారు. చేవెళ్ల సభకు భారీ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, డి.అశోక్ పాల్గొన్నారు.

జీవో 317 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు హర్షణీయం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 25: జీవో 317 ద్వారా అమలు చేసిన ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు గౌరారం గోపాల్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జీవో 292 ద్వారా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధ్యక్షతన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ సంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షణీయమన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలులో భాగంగా ఉద్యోగుల శ్వాశత కేటాయింపు కోసం గత ప్రభుత్వం 2021 డిసెంబరు 6న జీవో 317 ద్వారా ఏకపక్షంగా విడుదల చేసిన మార్గదర్శకాల కారణంగా పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయినట్లు వాపోయారు. క్యాడర్‌లో జూనియర్ అయినందుకే స్వంత జిల్లాలను వదిలి పరాయి జిల్లాకు కేటాయించబడ్డారన్నారు. భార్యాభర్తలను వేర్వేరు జిల్లాలకు కేటాయించారన్నారు. నిబంధనల ప్రకారం భార్యాభర్తలను ఒకేజిల్లాకు బదిలీ చేయాల్సి ఉండగా 19జిల్లాల్లో అనుమతించి 13జిల్లాలకు బ్లాక్ చేశారన్నారు.